

యూటిఎఫ్ హోమ్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

ప్రజాశక్తి-కాకినాడ

ఉపాధ్యాయ బదిలీలు ప్రమోషన్లు, షెడ్యూల్ ప్రభుత్వం విడుదల చేసిన సందర్భంగా యుటిఎఫ్ హోమ్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సూరిబాబు, నాగేశ్వరరావు తెలిపారు. ఈ అవకాశాన్ని బదిలీల కోసం అప్లయ్ చేసుకునే వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలు సందేహాలు నివృత్తి చేయడం కోసం జూన్ నెల 11వ తేదీ వరకూ, బదిలీలు ప్రమోషన్లు ప్రక్రియ పూర్తయ్యే వరకు జిల్లా యుటిఎఫ్ నాయకత్వం అందుబాటులో ఉంటుందని రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి పేర్కొన్నారు. జిల్లాలో తుని, జగ్గంపేట, పిఠాపురంలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్టు గౌరవాధ్యక్షుడు సాయిరాం తెలిపారు. ఉపాధ్యాయులు ఉచితంగా ఈ సేవలు వినియోగించుకోవచ్చని సూచించారు.

కూటమిలో పదవుల కుంపటి


- నామినేటెడ్ పోస్టుల్లేక టిడిపిలో కాక
- పొత్తు ధర్మం లేదంటున్న కీలక నేతలు
- మహానాడు వేదికగా తమ్ముళ్ల అసంతృప్తి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లా కూటమిలో కుంపట్లు రాజుకుంటున్నాయి. నామినేటెడ్ పదవుల విషయంలో టిడిపి నేతలు తీవ్ర అసంతప్తిలో కనిపిస్తున్నారు. కీలక పదవులన్నీ జనసేన పార్టీ ఖాతాలోకి వెళుతున్నాయని బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొత్తు ధర్మం ఎక్కడ అమలవుతోందంటూ సందర్భం వచ్చినప్పుడల్లా ముఖ్య నేతలు కుండబద్దలు కొడుతున్నారు. ఆ పార్టీలో ఒకే వ్యక్తికి మూడు, నాలుగు పదవులా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే భవిష్యత్తులో కాకినాడ జిల్లాలో తెలుగుదేశం పార్టీ నిర్వీర్యం ఖాయమంటూ అధిష్టానానికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇకనైనా అధినాయకులు స్పందించి పార్టీ పరిస్థితులను చక్కనిద్దాలని లేకపోతే తీవ్రం నష్టం తప్పదంటూ మెజారిటీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కీలక పదవులన్నీ జనసేనకేనా..?

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తవుతోంది. అయితే సూపర్ సిక్స్ పథకాలు అమలు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందంటూ పాలనపై అనేకమంది ప్రజలు అసంతృప్తిలో ఉన్నారు. ఇదిలా ఉండగా టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా పలువురు టికెట్లు ఆశించిన వారంతా నిరాశలో ఉన్నారు. కనీసం నామినేటెడ్ పోస్టులయినా దక్కుతాయని ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో అసంతృప్తిలో ఉన్న పెద్దాపురం జనసేన టికెట్ ఆశించి బంగపడిన తుమ్మల రామస్వామి (బాబు) పార్టీ అధిష్టానంపై సీరియస్ అయ్యారు. దీంతో ఆయనకి పెద్దాపురం పార్టీ ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించడంతోపాటు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కూడా నియమించారు. అంతేకాక కుడా చైర్మన్‌గా అవకాశం కల్పించింది. ఈ పదవులు ఉండగానే ఇటీవల ఉమ్మడి జిల్లా పరిధిలోని డిసిసిబి చైర్మన్ పదవిని కూడా కట్టబెట్టింది. దీంతో ఇక్కడే పెద్ద దుమారం రేగింది. డిసిసిబి పదవిపై టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో కాకినాడ ఎంపీ స్థానం పొత్తులో భాగంగా తనకే దక్కుతుందని ఆశించినా చివరకు జనసేనకు కేటాయించారు. దీంతో తగిన ప్రాధాన్యత దక్కుతుందని ఏడాదికాలంగా ఆయన ఎదురుచూస్తున్న పరిస్థితి. అలాగే కాకినాడ రూరల్ ప్రాంతానికి చెందిన పిల్లి సత్తిబాబు కూడా టిడిపి సీనియర్ నేతగా ఉన్నారు. బిసి కేటగిరీలో కనీసం డిసిసిబి తనకే వస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆయనతోపాటు ఇదే పదవిపై కోనసీమ ప్రాంతానికి చెందిన మాజీ మంత్రి మెట్ల సత్యనారాయణ కుమారుడు రమణబాబు కూడా ఆశించి భంగపడ్డారు. ఇప్పటికే సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రాష్ట్ర స్థాయి పదవిని జనసేన నాయకుడైన తోట సుధీర్‌కు కేటాయించారు. ఇలా కీలక పదవులన్నీ ఆ పార్టీ నాయకులకు మాత్రమే దక్కుతూ ఉండడంతో టిడిపి నేతలు తీవ్ర అసంతప్తిలో ఉన్నారు.



మహానాడు వేదికగా అసంతప్తులు

ఇటీవల పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల మహానాడులు నిర్వహించారు. తాజాగా జిల్లా స్థాయి మహానాడు కూడా కాకినాడలో ఏర్పాటు చేశారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌తో పాటు సీనియర్ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, పిఠాపురానికి చెందిన మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ, పిల్లి సత్తిబాబు తదితరులు మహానాడు వేదికగా బహిరంగంగానే అసంతప్తిని వ్యక్తం చేశారు. పొత్తు ధర్మం ఎక్కడా అమలు కావడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిష్పత్తి ప్రకారం పదవులు టిడిపికి దక్కడం లేదనేది వారి వాదన. పదవులన్నీ ఒకే పార్టీకి ఎలా కట్టబెడతారంటూ బహిరంగంగా ప్రశ్నలు వినిపించాయి. ఇలా అయితే తెలుగుదేశం పార్టీ పరిస్థితి దిగజారిపోతుందంటూ ఆందోళన వెలబుచ్చారు. భవిష్యత్తులో ఆ పార్టీ ఈ జిల్లాలో కనుమరుగయ్యే ప్రమాదం ఉందంటూ ఆవేదన చెందారు. కష్టకాలంలో కూడా పార్టీకి వెన్నుదన్నుగా నిలబడి భారీ మెజారిటీతో విజయం సాధించేలా కృషి చేస్తే ఇప్పుడు పార్టీ అధిష్టానం తమను కనీసం గానైనా గుర్తించకపోవడం ఏమిటనే ప్రశ్నలు ఆ నేతల నుంచి వినిపించాయి. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఇబ్బందులు పెట్టినా, అక్రమ కేసులు సైతం బనయించినా భరించి నిలబడి ఉన్నామని వారు చెబుతున్న మాటలు. ఈ తరుణంలో నామినేటెడ్ పదవులు జనసేనకు మాత్రమే కేటాయిస్తుండడంపై కాకినాడ జిల్లా టిడిపి నేతలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. మరోవైపు కాకినాడ జిల్లాలో ఎంఎల్‌ఎల సఖ్యత లేదని జ్యోతుల నెహ్రూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పరిస్థితి వేరేగా ఉండేదని, ఏ సమస్య వచ్చినా అందరు ఎంఎల్‌ఎలు కలిసి కూర్చుని మాట్లాడుకుని అధిష్టానం దృష్టిలో పెట్టి సమస్య పరిష్కారానికి కృషి చేసేవారని, ఇప్పుడు అటువంటిదేమీ లేదని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో త్వరలో అన్నవరం దేవస్థానంతో పాటు వివిధ దేవాలయాల ట్రస్ట్ బోర్డుల చైర్మన్ల పదవుల విషయంలో అధిష్టానం ఆచితూచి నిర్ణయం తీసుకుని టిడిపికి కూడా పదవులు కేటాయించాలని పలువురు నేతలు ఈ సందర్భంగా కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలి

ప్రజాశక్తి-కాకినాడ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డిఆర్ఓ వెంకటరావు

జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు ఎన్నికల అధికారులతో కలిసి శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వారిగా ఎలక్టోరల్ సంఖ్య, నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలు, సలహాలు, బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు నియామకం, శిక్షణ కార్యక్రమాలు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఆధార్ నెంబర్ కు ఎలక్ట్రోరల్ అనుసంధానం చేయడం వంటి అంశాలను ఈ సందర్భంగా ఆయన రాజకీయ పార్టీలు ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీతో పాటు అవసరమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్టం చేసే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అవసరమైన సూచనలు, సలహాలు తీసుకుంటుందన్నారు. ఎన్నికల సమయంలోనే కాక ముందుగానే ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, మార్పులు, చేర్పులు తొలగింపు, ఓటర్ల సంఖ్య అనుగుణంగా నూతన పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు వంటి అంశాలపై చర్యలకు భారత ఎన్నికల సంఘం ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రతినిధులు తప్పులు లేని ఓటరు జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల తరలింపు, నూతన పోలింగ్ కేంద్రాల ప్రతిపాదన, పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, 18-19 వయసుగల యువత ఓటు నమోదు వంటి అంశాలపై తమ సూచనలు, సలహాలు అందించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలన్నారు.

కాకినాడ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 1640 పోలింగ్ కేంద్రాల్లో 16 లక్షల 37, 740 మంది ఓటర్ల ఉన్నారన్నారు. దీనిలో 1000-1200 మంది ఓటర్లు 583 పోలింగ్ కేంద్రాల్లోనూ, 1200పైన ఓటర్లు 282 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని ఆయన తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు నాటికి ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో 800-1200 మంది ఓటర్ల ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి విభాజించటం జరుగుతుందని ఆయన తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెండు కిలోమీటర్లకు మించి పోలింగ్ కేంద్రం ఓటర్లకు దూరంగా ఉండకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైనన్ని అన్ని సదుపాయాల కల్పనకు కషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారి ఎం.జగన్నాథం, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎస్.అప్పారావు (బిఎస్‌పి), కె.కృష్ణమోహన్(ఆప్), ఆర్.వెంకటేశ్వరరావు (వైసిపి), పి.రవి కిరణ్ (బిజెపి), డి.శేషబాబ్జీ (సిపిఎం), ఎ.సత్యనారాయణ (జనసేన) పి.కృష్ణ (కాంగ్రెస్) ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలకు 25న ఎంపికలు

ప్రజాశక్తి - సామర్లకోట

జూన్ 1న పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరగనున్న అంతర్ జిల్లాల స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకుగాను ఈ నెల 25న సామర్లకోట పట్టణం దుర్గాప్రసాద్ పాఠశాలలో క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం జరుగుతున్నట్టు కాకినాడ జిల్లా అమెట్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ కార్యదర్శి ఇరుసుమల్ల రాజు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్లు నిండిన విద్యార్థులు జూలై ఒకటో తేదీన జరగనున్న అంతర్ జిల్లాల ఈత పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. వీరికి ఈ నెల 25న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సామర్లకోట దుర్గాప్రసాద్ పాఠశాలలో ఉన్న ఈత కొలనులో ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న ఆసక్తి గల క్రీడాకారులు ఈ ఎంపికలో పాల్గొనవచ్చునని ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రాజు తెలిపారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ ఆర్‌టిసి బస్ స్టేషన్, కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగు పరిచే నిమిత్తం శుక్రవారం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో అల్పాహారాన్ని భుజిస్తున్న వినియోగదారులను ఆయన నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. కార్గో సెక్షన్‌లో వినియోగదారులను స్వయంగా అడిగి వారికున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. స్టాల్స్ అన్నిటిలో ఎంఆర్‌పి ధరలు కచ్చితంగా పాటించాలని దుకాణ యాజమానులకు సూచించారు. ప్రయాణికులకు అందించే సేవల మెరుగుదలపై బస్ స్టేషన్ మేనేజర్ ఎంయువి మనోహర్‌కు తగు సూచనలు చేశారు.



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పోక్సో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని పడాల చారిటబుల్ ఎఒ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం గొల్లప్రోలు పిహెచ్‌సిలో పడాల చారిటబుల్ ట్రస్ట్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బందికి పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోక్సో చట్టం ద్వారా బాల బాలికలు ఏ విధమైన వేధింపులకు గురికాకుండా ఉండడానికి ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు.

చెత్త సేకరణలో బిగ్ బాగ్

ప్రజాశక్తి -కరప

చెత్త సేకరణలో బిన్ బాగ్ విధానంపై గ్రామస్తులకు అవగాహన కల్పించినట్టు ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు తెలిపారు. పెనుగుదురు గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటికి చెత్త సేకరణకు వచ్చినప్పుడు తడి పొడి చెత్త లను విడివిడిగా ఇవ్వాలని ప్రజలకు తెలిపారు. ఈ చెత్త సేకరణ ద్వారా సంపద కేంద్రాలకు తరలించి సేంద్రీయ ఎరువులను తయారు చేసి ఇటు తోట పంటలకు అటు వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా ఉత్పత్తి చేస్తామన్నారు.

కార్టూ'నిజం'





ఇరిగేషన్ కాల్వను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ఇరిగేషన్ కెనాల్‌ను స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి-పిఠాపురం

కబ్జాకు గురైన ఇరిగేషన్ కెనాల్‌ను అధికారులు తక్షణం స్వాధీనం చేసుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి డిమాండ్ చేశారు. సిపిఎం మండల కన్వీనర్ కె.చిన్న ఆధ్వర్యాన కెనాల్ ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. నర్సింగపురం గ్రామ పంచాయితీకి సంబంధించిన బైపాస్ రోడ్డు అనుకుని ఉన్న పంట పొలాల్లో రియల్ ఎస్టేట్ చేస్తున్నారన్నారు. 170 మంది రైతులు ఈ కింద పొలాల్లో వ్యవసాయం సాగు చేస్తున్నారని రియల్ ఎస్టేట్ పేరుతో పంట పొలాలకు సాగు నీరు వెళ్లకుండా ఇరిగేషన్ కెనాల్ మూసివేసినట్టు తెలిపారు. రియల్ ఎస్టేట్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా కెనాల్ మూసివేశారని తక్షణం ఈ పంట పొలాలకు సాగు చేస్తున్న రైతుల కోసం సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. పంటలకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పి.చామవరంలో గిరిబాబు పర్యటన

ప్రజాశక్తి-రౌతులపూడి

పి.చామవరంలో వైసిపి ప్రత్తిపాడు నియోజవర్గ ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబు శుక్రవారం పర్యటించి వైసిపి నాయకులు, కార్యకర్తలను ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైసిపి నాయకులు బండారు ఏసుబాబు నివాసంలో వైసిపి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలతో పరిపాలన చేపడుతున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగూరి లక్ష్మీ శివకుమారి, వైసిపి నాయకులు వాసిరెడ్డి జమీలు, వైసిపి మండల అధ్యక్షుడు సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కర్ బాబు, వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి గొల్లు వెంకటరమణ ఉన్నారు.

ప్రశాంతంగా ఎపిఇఎపి సెట్-2025

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఎపిఇఎపిసెట్-2025 ఆన్‌లైన్ పరీక్ష శుక్రవారం ఐదో రోజు ప్రశాంతంగా జరిగినట్టు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉదయం ఆదిత్య యూనివర్సిటీలో 240 మందికిగాను 233 హాజరు కాగా ఏడుగురు హాజరు కాలేదని, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 295 మందికిగాను 284 మంది హాజరు కాగా 11 మంది హాజరు కాలేదని, సాయంత్రం ఆదిత్య యూనివర్సిటీలో 240 గాను 235 హాజరు కాగా 05 మంది హాజరు కాలేదని తెలిపారు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో 294 మందికిగాను 284 మందిహాజరు కాగా 10 మంది హాజరు కాలేదని తెలిపారు. ఈ ఎగ్జామ్స్‌కు చీఫ్ సూపరింటెండెంట్‌గా ఆదిత్య ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ వ్యవహరించారు. ప్రొఫెసర్ ఎం.రాజబాబు, ప్రొఫెసర్ టి.శ్రీనివాసులు, ప్రొఫెసర్ వీరప్రసాద్ కో ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

నెలాఖరుకు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-తాళ్లరేవు



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ

ఈ నెలాఖరులోగా పెండింగ్‌లోని గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్‌వివి.సత్యనారాయణ ఆదేశించారు. తాళ్లరేవు మండల పరిషత్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ జిల్లాలో గతేడాది ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా 11,997 గృహాలు మంజూరు కాగా 7,197 గృహాలు ప్రారంభమయ్యాయని, వీటిలో 3,490 మాత్రమే పూర్తి చేశారని, మిగిలిన 4,800 త్వరలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణానికి సంబంధించి ఎస్‌సి, బిసి లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా అదనంగా రూ. 50 వేలు, ఎస్‌టి లబ్ధిదారులకు రూ.70వేలు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ మేరకు 4,109 మంది లబ్ధిదారులకు రూ.5.95 కోట్ల సాయం అందించనున్నామని అన్నారు. ఒసిల్లో పేదలకు స్త్రీ నిధి ద్వారా రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకూ ఇవ్వడానికి అవకాశం ఉందని, దీని ద్వారా లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తిచేసేలా చూడాలని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం గృహ నిర్మాణానికి సంబంధించి రూ.లక్షా 80,000 అందిస్తోందని, వచ్చే నెల నుంచి రూ.2 లక్షల 50 వేలు ఇవ్వనుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా కరప తర్వాత తాళ్లరేవు మండలం 80 శాతం పైన నిర్మాణాలు పూర్తి చేసినందుకు అధికారులను అభినందించారు. మిగిలిన నిర్మాణాలు పూర్తిచేయాలని తెలిపారు. జూన్ 12 నాటికి రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడానికి ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. ఈ సమీక్షలో ఎంపిడిఒ సత్యనారాయణ హౌసింగ్ ఎఇ శ్రీనివాసరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రామారెడ్డి, సాయిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండియు వాహనాల రద్దుపై ధర్నా

ప్రజాశక్తి-పిఠాపురం



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న ఆపరేటర్లు

ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేయడానికి ఏర్పాటు చేసిన ఎండియు వాహనాలను కూటమి ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఎపి ఎండియు ఆపరేటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆపరేటర్లు శుక్రవారం ఆందోళన చేపట్టారు. స్థానిక పశువుల సంత నుండి ఉప్పాడ బస్ స్టాండ్ సెంటర్ వరకూ వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు సిద్ధాంతపు రవికుమార్, మండల అధ్యక్ష కార్యదర్శులు ఆళ్ల సుబ్రమణ్యం, యాదాల అప్పలరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన ఎండియు వాహనాలతో ప్రతి గడపకూ రేషన్ సరుకులు అందిస్తున్నామని, కూటమి ప్రభుత్వం ఈ వాహనాలను రద్దు చేసే విధంగా ఆలోచన చేయడం సరి కాదని హితవు పలికారు. రాష్ట్రంలో పలు విపత్కర పరిస్థితులలో ఎండియు వాహనాల ద్వారా రాష్ట్ర ప్రజలకు అనేక సేవలందించారని గుర్తు చేశారు. దీని మీద ఆధారపడి అనేకమంది తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని, వీటిని రద్దు చేయడంతో కుటుంబాలు రోడ్డుపాలు అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న ఎండియు ఆపరేటర్లకు మాజీ ఎంపీ, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంగా గీత సంఘీభావం తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎండియు వాహనాల రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం తహశీల్దారు పి.గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దైవ-పాల్, చెట్ల శ్రీను, చొల్లంగి వీరభద్రరావు, ఎం.వరప్రసాద్, ఒ.కోదండరాం, వెంకటరమణ, బాబ్జీ, వైసిపి నాయకులు రావుల మాధవరావు, జి.బాబీ, నాగమల్లీశ్వరి, వర్ధినీడి సుజాత, వి.శ్రీను, అడపా రఘు, జెడ్‌పిటిసి లోవరాజు, ఆనాలా సుదర్శన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జానపద కళారూపాలు సాంస్కృతిక జీవనాడులు

ప్రజాశక్తి - పెద్దాపురం

జానపద కళారూపాలే భారతీయ సంస్కృతికి జీవనాడులను ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారుడు దారపురెడ్డి కృష్ణ అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన జానపద నృత్యాలు, కోలాట కళారూపాల శిక్షణా శిబిరంలో ఆయన ప్రసంగించారు. జానపద నృత్యాలు, జానపద పాటల్లో భారతీయ సాంస్కృతిక జీవితమంతా మిళితమై ఉంటుందన్నారు.మన సంస్కతిని రక్షించుకోవాలంటే కళారూపాలు, పాటలు, నృత్యాలపై చిన్ననాటి నుంచి బాలలకు అవగాహన పెంచాలన్నారు. చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో కోలాట రూపకాలపై ఊటా అంజలి, అనూషా, జిస్విత్తా శిక్షణ ఇచ్చారు. జానపద నత్యాలపై సందీప్, కూనిరెడ్డి రవి, అమృత, నమ్రతలు శిక్షణ ఇచ్చారు. కుట్లు, అల్లికలపై రత్నం, కర్ర సాములో నీలపాల కృష్ణ, పద్యాలపై తాటిగడప సుబ్బారావు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి రొంగల అరుణ్ కుమార్, సాయి, బంగారం, నేహా, రేణుక, లలిత, లావణ్య, సందీప్, హర్ష, భాషా, పవన్ కుమార్, మనోజ్, కృష్ణ, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కోలాటంలో శిక్షణ పొందుతున్న బాలలు



కాకినాడ జిజిహెచ్‌లో సిద్ధం చేసిన కోవిడ్ బ్యాక్

కోవిడ్ కోడ్‌తో జిజిహెచ్ అప్రమత్తం

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వం కరోనా నియమాలు అమలులోకి తెచ్చిన నేపథ్యంలో కాకినాడ జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపిఆర్.విఠల్ ఆసుపత్రి ప్రాంగణంలోని కోవిడ్ ఐసోలేషన్ వార్డులను శుక్రవారం పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్శనలో ఆయన వెంటిలేటర్లు, బెడ్స్, ఆక్సిజన్ సరఫరా, పిపిఇ కిట్స్, మాస్కులు, గ్లౌజులు తదితర సదుపాయాల లభ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను అనుసరిస్తూ, జిజిహెచ్‌లో ప్రత్యేక కోవిడ్ వార్డులు ఏర్పాటు చేశామన్నారు.



సమ్మె శిబిరంలో నినదిస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

17వ రోజుకు ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం సెంటర్‌లో నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజనీరింగ్ కార్మికులు నిరసన వ్యక్తం చేస్తూ తమ సమస్యలు పరిష్కరించాలని, తమకు వేతనాలు పెంచాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు, బోనాల వెంకటరమణ, బాసిన భద్రరావు, వాకాడ భాస్కరరావు, పూల ప్రశాంత్, బొమ్మన రవికుమార్, ఎస్‌కె.బషీర్, నామ్‌సూర్య ప్రకాష్, తూతిక సాయి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో బిఎస్ఎన్ఎల్ సిజిఎం పూజలు

ప్రజాశక్తి -సామర్లకోట



పూజలు చేస్తున్న సిజిఎం కుటుంబం

భీమేశ్వరాలయంలో బిఎస్ఎన్ఎల్ సౌత్ ఇండియా (ఐటిసి) చీఫ్ జనరల్ మేనేజర్ పి.మురళీ మోహన్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చిన సిజిఎంకు ఆలయ ఇఒ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం భీమేశ్వర స్వామికి, బాలా త్రిపుర సుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వారికి ఆలయ నంది మండపంలో పండిత ఆశీర్వచన పూజలు జరిపి, స్వామివారి చిత్ర పటాన్ని, ప్రసాదం అందించి గౌరవించారు. ఈ పూజల్లో సామర్లకోట పట్టణ పరిధిలోని బిఎస్ఎన్ఎల్ అధికారులు, ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు, ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని ఎర్రపోతవరం వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య, భర్తలు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. రామచంద్రపురం పట్టణంలోని రాజు గారి కోట కాలనీకి చెందిన ఉందుర్తి సురేష్, భార్య స్నేహలతతో కలిసి యానం నుంచి రామచంద్రపురం స్వగ్రామానికి బయలుదేరి మార్గమధ్యలో ఎర్ర పోతవరం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భార్య, భర్తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు ఫోన్ చేసి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి తరలించారు. దీనిపై కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

స్థానిక మెయిన్ రోడ్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అయినవిల్లి మండలం పోతుకూరు గ్రామానికి చెందిన సాగిరాజు నరసింహారాజు(54) మండల పరిధిలోని పల్లంకూరు శివారు లైట్ హౌస్ ప్రాంతంలో ఉన్న ఆనంద హేచరీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం నరసింహారాజు బైకుపై పల్లంకూరు వైపు వెళుతుండగా పల్లం నుంచి కాకినాడ వెళుతున్న ఆర్‌టిసి బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో నరసింహారాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన 108లో అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అతనిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు. ఆర్టీసీ బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

భార్యపై దాడి చేసిన భర్త అరెస్టు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

భార్యపై కత్తితో దాడి చేసిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల చేబ్రోలులో కిలాడి జ్యోతిపై ఆమె భర్త శ్రీను కత్తితో దాడి చేయగా ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై పోలీసులు కేసు కేసు నమోదు చేశారు. శుక్రవారం శ్రీనును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలో స్థానిక హోటల్లో పని చేస్తూ వేడినీళ్ల మీదపడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13న పుడికోడి కష్ణన్ పద్మనాభన్ స్థానిక హోటల్‌ల్లో పని చేస్తూ వేడీనీరు దింపుతుండగా నీళ్ల కాలు మీద పడి గాయపడ్డాడు. అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందాడు దీనిపై మృతుని సోదరుడు కృష్ణన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మోటార్లను దొంగిలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

ప్రజాశక్తి- గోకవరం

మండలంలో రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాలలో బ్యాటరీ లు, పొలాల్లో మోటార్ ఇంజిన్లను చోరీ చేస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 4 బ్యాటరీలు, 1 మోటార్ ఇంజన్‌ను రికవరీ చేశామని పోలీసులు తెలిపారు. పూర్తి దర్యాప్తు అనంతరం రిమాండ్‌కు తరలిస్తామని ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-తొండంగి

తొండంగి మండలం బెండపూడి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా మరో ఇద్దరు స్వల్పంగా గాయపడినట్టు తొండంగి పోలీసులు తెలిపారు. గోపాలపట్నం గ్రామానికి చెందిన సాయి ఆనంద్ తమ తల్లిదండ్రులను బైకుపై కాకినాడ నుండి తన గ్రామానికి తీసుకొని వస్తుండగా బెండపూడి సమీపంలో జాతీయ రహదారిపై బైకు అదుపుతప్పి కింద పడిపోవడంతో బైకుపై ఉన్న తల్లి అమ్మాజీ అక్కడక్కకే మృతి చెందగా తండ్రి సూరిబాబు, ఆనంద్‌కు గాయాలైనట్లు చెప్పారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

బైకు చక్రానికి చీర చుట్టుకుని మహిళ మృతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలం పోలేకుర్రు పంచాయతీ జైభీమ్ పేట వద్ద జాతీయ రహదారి 216పై గురువారం జరిగిన ఒక ప్రమాదంలో మేడిశెట్టి పద్మ (44) అనే మహిళ మరణించింది. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ రూరల్ మండలం రామారెడ్డి నగర్‌కు చెందిన మేడిశెట్టి పద్మ, శ్రీనివాసరావు దంపతులు యానాం వైపు నుంచి కాకినాడ బైకుపై వెళుతుండగా జైభీమ్ పేట సమీపంలో పద్మ చీర బైకు చక్రంలో పడి చుట్టుకుపోయింది. దీంతో కింద పడిపోయి గాయపడిన ఆమెను కాకినాడ జిజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు కోరంగి పోలీసులు తెలిపారు.

గంజాయితో ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - ఆలమూరు

గంజాయి కలిగివున్న ఐదుగురు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సిఐ సిహెచ్. విద్యాసాగర్ వెల్లడించిన వివరాల ప్రకారం... పెదపళ్ళ గ్రామ శివారులో ఉన్న స్మశాన వాటిక దగ్గర శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గంజాయి కలిగిన వ్యక్తులు ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. వెంటనే సిబ్బందితో దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. ఒక్కొక్కరి వద్ద 100 గ్రాముల చొప్పున గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీరి నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - పెద్దాపురం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్‌లో మున్సిపల్ శానిటరీ విభాగం అధికారులు, శానిటరీ మేస్త్రీలు, శానిటరీ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పగలే కాక రాత్రి కూడా చెత్తను తొలగించాలన్నారు. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు మెయిన్ రోడ్డులోని కమర్షియల్ చెత్తను పూర్తిస్థాయిలో తొలగించాలన్నారు. ప్రస్తుతం పెద్దాపురం పట్టణ పరిధిలో విస్తీర్ణం, ప్రతిరోజు వచ్చే చెత్త వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది, వారి విధి విధానాలు, ప్రస్తుతం ప్రతిరోజు చెత్త తొలగించే ప్రాంతాలు తదితర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దాపురం పట్టణ పరిధిలో ఏ ప్రాంతంలోనూ చెత్తకు సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు రాకూడదన్నారు. ఏ రోజు చెత్త పోగులను ఆ రోజే తొలగించాలన్నారు. అనంతరం ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ, సానిటరీ మేస్త్రీలు, సానిటరీ సెక్రటరీలతో కలిసి పట్టణ శివారులోని కంపోస్టు యార్డును పరిశీలించారు. చెత్త డంప్‌నకు సంబంధించి కొన్ని సూచనలు చేశారు. ఈ సమావేశంలో సానిటరీ ఇన్స్పెక్టర్ ఆదినారాయణ, మేస్త్రీలు అర్జి బుజ్జి, బోకం సూరిబాబు, భూపతి బబ్బులు, దొండపాటి శేషారావు, జాలా రాజబాబు, సానిటరీ సెక్రటరీలు వెంకట్రావు, భవాని, హేమ, ప్రత్యూష, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అడ్డాల

రమణయ్యపేటలో కాకినాడ ఐడిఎ, అడబాల ట్రస్ట్ ఆధ్వర్యాన కోవిడ్ కేసులు నమోదవుతున్న దృష్ట్యా ప్రజలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ ఐడిఎ కార్యదర్శి డాక్టర్ అడ్డాల మాట్లాడుతూ మన దేశంలో కోవిడ్-19 మళ్ళీ కలకలం రేపుతోందని, కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతున్నాయని, కేంద్ర ఆరోగ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా 260 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, ఈ పెరుగుదల మనల్ని అప్రమత్తం కావాలని హెచ్చరిస్తోందని తెలిపారు. వైజాగ్‌లో తొలి కేసు నమోదైనట్టు అధికారులు తెలిపారన్నారు. పార్టీలు, ఫంక్షన్లు, ప్రార్థనలు వంటి సమూహ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, ఎయిర్‌పోర్ట్‌ల్లో మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం తప్పనిసరి అని, 60 ఏళ్ల పైబడిన పెద్దలు, గర్భిణులు ఇంట్లోనే ఉండాలని, బయటకు వెళ్లకపోవడం ఉత్తమం అన్నారు. చేతులు తరచుగా కడుక్కోవడం శానిటైజర్ దగ్గర ఉంచుకోవడం, దగ్గు లేదా తుమ్ము వస్తే నోరు కప్పుకోవాలని, ముఖాన్ని తాకకుండా చూసుకోవాలని తెలిపారు. ఎక్కువ మంది ఉన్న బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ ధరించడం చాలా అవసరం అని, జ్వరం, దగ్గు, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే కోవిడ్ టెస్ట్ చేయించుకుని వైద్యులను సంప్రదించాలని అన్నారు. విదేశాలకు వెళ్లి వచ్చిన వారు తప్పకుండా కోవిడ్ పరీక్ష చేయించుకోవాలని, అనారోగ్యంగా అనిపిస్తే బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండటం ఉత్తమం అని, ఇతరులకు వ్యాపించకుండా జాగ్రత్త పడడం మన భాద్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

వర్షాలకు జగనన్న కాలనీ గుంతల్లో నీరు

ప్రజాశక్తి - జగ్గంపేట



జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు గుంతల్లో నిలిచిన నీరు

మండల కేంద్రమైన జగ్గంపేట జగనన్న కాలనీ వాసులను పట్టించుకునేవారే కరువయ్యారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల వెనుక ఉండే 75 ఎకరాల దివానంతోట పొలాన్ని కాస్తా గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలుగా ఇచ్చారు. సుమారు 2,800 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలుగా ఇస్తే పట్టణానికి దూరమైన అద్దె ఇళ్లలో ఉండలేక అప్పులు చేసి సుమారు 800 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. రోడ్లు సరిగ్గా లేకపోవడంతో చినుకు పడితే నరకయాతన పడుతున్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఎందుకు రోడ్లు వేయాలి అనే విధానంలో కూటమి ప్రభుత్వ నేతలు ఆ కాలనీని పట్టించుకోకపోవడంతో వర్షం వస్తే ఆ కాలనీ వాసులు నానా అవస్థలు పడుతున్నారు. కాలనీలోకి వెళ్ళే కాపు కల్యాణ మండపం రోడ్డులో పెద్ద, పెద్ద గుంతలు పడి వర్షం వస్తే నీరు నిలిచిపోతోంది. దీంతో కాలనీ వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి వెళ్ళే ప్రధాన రహదారులు రెండింటిని ఐనా నిర్మించండి అని అనేకమార్లు స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూకు విన్నవించామని కాలనీ వాసులు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారని అధికారులు, రహదారులను నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సైనిక్ ఫలితాలలో గ్రామీణ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-కోటనందూరు

త్రివిధ దళాలలో సేవలందించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సైనిక ప్రవేశ పరీక్షలో స్థానిక ఎవిఎం కోచింగ్ సెంటర్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని ఎవిఎం సంస్థల డైరెక్టర్ అల్లు విష్ణుమూర్తి అన్నారు. సైనిక పరీక్ష 300 మార్కులకు గాను 251 మార్కులతో మాకిరెడ్డి సాయి వెంకట ఆదిత్య, 236 మార్కులతో రావాడ చేతన్, 232 మార్కులతో కీర్తి వర్షిణి, 211 మార్కులతో చింతకాయల కుమార శివ నూకేష్, 180 మార్కులతో మిడతాన కౌశిక్ అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా ఎవిఎం సంస్థ డైరెక్టర్ అల్లు విష్ణుమూర్తి మాట్లాడుతూ, ఎవిఎం సంస్థ నుండి 25 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 15 మంది క్వాలిఫై అయ్యారు. మన గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టణ ప్రాంత విద్యార్థులతో పోటీపడి జాతీయ స్థాయిలో టాపర్స్‌గా నిలవడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. విద్యార్థులను ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందించారు.

వైద్య శిబిరంలో ఉచిత సేవలు

ప్రజాశక్తి - మామిడికుదురు



వైద్య సేవలందిస్తున్న యూనివర్శల్ లైఫ్ స్టైల్ వైద్యులు

మండలంలోని పెదపట్నంలంక గిడుగు వారి పాలెంలో హైదరాబాద్‌కు చెందిన యూనివర్సల్ లైఫ్ స్టైల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఉచిత సేవలు అందించారు. శుక్రవారం నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ సుందరనీడి రాజేష్‌కుమార్ ప్రారంభించారు. వైద్య నిపుణులు డాక్టర్ విమురళీధర్, కాదా లక్ష్మీ ఆధ్వర్యంలో కిడ్నీ, లివర్, గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు శరీరంలో కీలకమైన గుండె, కిడ్నీల ఆరోగ్య సంరక్షణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొమ్ముల జంగమయ్య, మాజీ సర్పంచ్ మామిడిశెట్టి శివరామప్రసాద్, గిడుగు వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లోడు ట్రాక్టర్ మినీవ్యాన్‌పై బోల్తా

ప్రజాశక్తి - ఆలమూరు



మినీ వ్యాన్ పై బోల్తా పడిన ధాన్యంలోడు ట్రాక్టర్

ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ మినీ వ్యాన్‌పై బోల్తా పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని జొన్నాడ జాతీయ రహదారిపై రావులపాలెం వైపు నుంచి మడికి వైపుకు వెళ్తున్న ధాన్యం లోడు ట్రాక్టర్ జొన్నాడ ఫ్లైఓవర్ వద్ద మినీ వ్యాన్‌పై బోల్తా పడింది. ప్రమాదంలో రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. సర్వీస్ రోడ్లును ఫ్లై ఓవర్ సిబ్బంది సరైన రీతిలో మరమ్మతులు చేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షపు నీటితో మునిగిపోయాయి. రోడ్డుకి గుంతలు ఏర్పడడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ధాన్యం మొత్తం రహదారిపై పడడంతో కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. హైవే, పోలీస్ సిబ్బంది సహకారంతో ట్రాఫిక్‌ను నియంత్రించి, సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫ్లై ఓవర్ పనులు పూర్తిచేసి ప్రతిరోజు జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి కెవివి.సత్యనారాయణ, అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పాత ఇసుకపల్లిలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీల పనికి సంబంధించిన కిట్లు పంపిణీ జరగడం లేదని, చాలా ప్రదేశాల్లో తాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్నామని కూలీలు వారి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీల సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరపాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 28 మంది బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం పెద్దాపురం ఒకటో వార్డు శివారు దమ్ముపేటలో అమరవీరుల సంతాప సభలో పలువురు మాట్లాడారు. అటవీ సంపదను, సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికే కేంద్ర ప్రభుత్వం కగార్ పేరుతో మధ్య భారత అడవులలో ఆదివాసీలను బూటక ఎన్‌కౌంటర్ల పేరుతో బూటకపు హత్యలు చేస్తున్నారన్నారు. ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేసి మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలని, అడవుల్లో ఉన్న బలగాలను వెనక్కి రప్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కర్నాకుల వీరాంజనేయులు, వి.రాజబాబు, బి.రమేష్, కె.సతీష్, సంగీత, దుర్గాదేవి, సురేష్ ప్రసంగించారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - సామర్లకోట

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకుల నైపుణ్యాలను మెరుగు పరిచే ఉద్దేశంతో సామర్లకోట నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (నాక్) శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా నైపుణ్య శిక్షణలు అందించి, వారు తీసుకున్న శిక్షణకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం ప్రారంభించినట్టు శిక్షణా కేంద్రం ఇన్‌ఛార్జి ఎన్.తాతారావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ దీనిలో భాగంగా అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ప్రధానంగా సర్వేయింగ్, ప్లంబింగ్ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు ఆసక్తిగల యువత దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. సర్వేయింగ్ కోర్స్ 75 రోజులు ఉంటుందని దీనికి ఐటిఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివిన యువత అర్హులన్నారు. 60 రోజుల ప్లంబింగ్ కోర్స్‌కు పదో తరగతి లోపు, ఐటిఐ, ఇంటర్ చదివిన యువత అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే యువత వయసు 18 నుంచి 40 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఆసక్తిగల యువత ఈ నెల 26వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చునని, పూర్తి వివరాలకు సామర్లకోట సిబిఎం హైస్కూల్ ఎదురుగా ప్రత్తిపాడు సెంటర్లో ఉన్న నాక్ శిక్షణా కేంద్రంలో సంప్రదించాలని ఇన్‌ఛార్జి తాతారావు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

ఇటీవల అనారోగ్యంతో మరణించిన వజ్రపు సుబ్బలక్ష్మి కుటుంబ సభ్యులను కాకినాడ మాజీ ఎంపీ, వైసిపి పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంగా గీత విశ్వనాథ్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్థిక సహాయాన్ని, బియ్యం అందించి బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా వైసిపి నుంచి సహాయ సహకారాలు అందిస్తామని వైసిపి మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వడ్డి నాగమణి, మెరుగు ఆనందరావు, శాఖ చిన్నబ్బాయి, మాత కుమార్, జెల్ల సుధీర్, వడ్డి అంబేద్కర్ తదితరులు ఉన్నారు

26, 27న ముదుగులమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండలం హుస్సేన్‌పురంలో ఈ నెల 26, 27 తేదీల్లో జరగనున్న మదుగులమ్మ అమ్మవారి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పండుగను సాంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలని సామర్లకోట సిఐ ఎ.కృష్ణ భగవాన్ చెప్పారు. శుక్రవారం సాయంత్రం హుస్సేన్‌పురంలో గ్రామ పెద్దలతో ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణభగవాన్ మాట్లాడుతూ జాతర ఉత్సవంలో అశ్లీల నృత్యాలు, ఎలాంటి గొడవలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకునేలా చూడాలని పిలుపునిచ్చారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ నాయకులు, గ్రామ నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు పాల్గొన్నారు.

మద్యం షాపుల వద్ద తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి పెద్దాపురం ఎక్సైజ్ సిఐ దుర్గార్జునరావు ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది పెద్దాపురంలో మద్యం షాపుల వద్ద తనిఖీలు నిర్వహించారు. అనంతరం సిఐ దుర్గా అర్జునరావు మాట్లాడుతూ మద్యం షాపుల వద్ద మద్యం విక్రయాలలో ఎంఆర్‌పి ధరల ఉల్లంఘన, మద్యం దుకాణాల టైమింగ్ నియంత్రణలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల సందర్భంగా ఎవరిపైనా కేసులు నమోదు చేయలేదన్నారు. ఏ మద్యం షాపు వద్దనైనా ఎంఆర్‌పి ధరలకంటే ఎక్కువ వసూలు చేసినా సమయం ముగిసినా మద్యం విక్రయాలు జరిపినా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీలు ప్రతిరోజు నిర్వహిస్తామన్నారు.

12 మందికి సిఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

ప్రజాశక్తి -కరప

కాకినాడ రూరల్ పరిధిలోని 12 మందికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంఎల్ఎ పంతం నానాజీ పంపిణీ చేశారు. శుక్రవారం గొడారిగుంటలోని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ కార్యాలయం వద్ద రూరల్ నియోజకవర్గ పరిధిలోని 12 మందికి రూ.9 లక్షల 69 వేలను సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంతం నానాజీ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నానాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ, గత ప్రభుత్వ పనితీరు వల్ల ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్న కూడా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందిస్తోందన్నారు. ఈ కార్యాక్రమంలో కరెడ్ల గోవిందు, భోగిరెడ్డి కొండలరావు, నందిపాటి త్రిమూర్తులు, పితాని తేజ, కరప డిసి చైర్మన్ పుణ్యమంతుల గంగ సత్యనారాయణ, చుండ్రు వెంకన్నరావు చౌదరి, కోటగిరి మహేంద్ర బాబు, వెలుగుబంట్ల సూరిబాబు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌కు శంకుస్థాపన చేస్తున్న జ్యోతుల నవీన్

అన్న క్యాంటీన్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహం వద్ద నూతనంగా నిర్మించే ఎన్‌టిఆర్ అన్న క్యాంటీన్‌కు టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.61 లక్షల ప్రజారోగ్య శాఖ నిధులతో ఈ క్యాంటీన్‌ను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లో అతి స్వల్పధరకే ఆహారాన్ని అందిస్తామని తెలిపారు. పేదలకు ఉపయోగపడే విధంగా ఇక్కడ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, మంగరౌతు రామకృష్ణ, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, పురంశెట్టి శివాజీ, పబ్లిక్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ డిఇ గంగరాజు, తహశీల్దార్ జెవిఆర్.రమేష్, ఎంపిడిఒ చంద్రశేఖర్, పంచాయతీరాజ్ డిఇ ఉమాశంకర్, ఎఇ నారాయణమూర్తి పాల్గొన్నారు.

అన్నవరం ఎఇఒ కొండలరావుకు షోకాజ్ నోటీస్

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం దేవస్థానంలో ఆలయ అధికారి (ఎఇఒ) కోటగిరి కొండలరావుకు ఇఒ వీర సుబ్బారావు షోకాజ్ నోటీసు జారీ చేశారు. కొండలరావు సేవకుల పట్ల దురుసుగా ప్రవర్తించాలని వచ్చిన ఆరోపణలపై ఇఒ ప్రాథమిక విచారణ చేశారు. ఎఇఒకు నోటీసు జారీ చేశారు.

కిశోర బాలలకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

బాలలు మార్గదర్శకత్వం అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగ కౌన్సిలర్ బి.దుర్గారాణి అన్నారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖాధికారి కె.విజయ కుమారి ఆదేశాలతో పిఠాపురం ప్రాజెక్టు సిడిపిఒ సిహెచ్ఎస్‌కె.దుర్గా దేవి ఆధ్వర్యంలో శుక్రవారం ఎండపల్లి గ్రామ సచివాలయంలో కిశోర వికాసం సమ్మర్ క్యాంపెయిన్ ఏడో షెడ్యూల్ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దుర్గారాణి మాట్లాడుతూ బాలల విద్యా నైపుణ్యాలు, కెరీర్ మార్గదర్శకత్వ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్టర్ సూపర్వైజర్ డి.సుజాత, జిఎంఎస్‌కెడి.జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.గౌరీ, వెంకటలక్ష్మి, అర్చనమ్మ, కిషోర్ పాల్గొన్నారు.